PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 217 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 02 ఆగస్టు 2026


17 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్లేట్లు పంపిణీ




అంబులెన్స్‌లోనే మహిళకు సుఖప్రసవం తల్లి, శిశువు క్షేమం




## భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి

# కొత్త రన్‌వే

- స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి కీలకమైన రోజు
- నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయి
- చంద్రబాబు విజన్‌తో ఎపి అభివృద్ధిలో పరుగెడుతోంది
- 12 ఏళ్లలో దేశంలో కొత్తగా 166 విమానాశ్రయాలు నిర్మించాం
- విమానం ఎక్కాలన్న పేదల కల సాకారం చేస్తున్నాం
- భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించిన మోడీ
- పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం






**విజయనగరం,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి నేడు కీలకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రూ.18 వేల కోట్లతో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆయన చెప్పుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. 'ఈ నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయ న్నారు. కొత్త ప్రాజెక్టులు ఎయిర్, రోడ్ కనెక్టివిటీని పెంపొందిస్తాయి. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు చేస్తున్నా. మిగతా2లో...

## నల్ల చెరువు పునరుజ్జీవంలో

# హైడ్రా అహర్నిశలు కృషి

### అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తోన్న రాష్ట్రం..సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్



**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి హైడ్రా అహర్నిశలు శ్రమించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులకు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు శనివారం ట్వీట్ చేశారు. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూ... మన చెరువులకు జీవం పోస్తూ... జీవంతో నిండిన భవిష్యత్తును భావి తరాలకు హైడ్రా అంకితం చేస్తోందని తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదనీ, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా అని పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ... ప్రజల ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న తెలంగాణరాష్ట్రంలో తమ పార్టీ మిగతా2లో...

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

- నీళ్లు మళ్లించే ఏపి కుట్రలు వేగమయ్యాయి
- బీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపణ




## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

### వాట్సాప్ అంకుల్స్ వర్సెస్ ఇన్‌స్టాగ్రామ్ పిల్లలకు మధ్య పోరాటం..

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** యువతరం కొత్త తరహాలో దిల్లీలో కదం తొక్కిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం. అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబోతున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు మిగతా2లో...



## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు మిగతా2లో...

## ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ

# రాష్ట్రానికే గర్వకారణం


- గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన
- పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక మిగతా2లో...

## భద్రాచలం వల్ల నిలకడగా గోదావరి

- 56 అడుగులకు చేరిన నీటిమట్టం
- భద్రాచలం చుట్టుపక్కల చేరిన వరదనీరు
- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి తుమ్మల




## ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన

# మీసేవ లావాదేవీలు

- తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు
- దేశంలోనే నెంబర్ వన్‌గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆ÷-లనైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మిగతా2లో...




## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

### విద్వేషపూరిత ప్రసంగాలపై అసెంబ్లీలో బిల్లు: పొన్నం

**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. మిగతా2లో...

# భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

(మొదటి పేజీ తరువాయి)

13 వేల మంది గిరిజన మహిళల నృత్యం అద్భుతంగా ఉంది. అభివృద్ధితోపాటు థింసా నృత్యంలోనూ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇది చంద్రబాబు విజన్‌కు మరో సాక్ష్యం' అని పేర్కొన్నారు. విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చూసి మధురానుభూతికి లోనయ్యా. అభివృద్ధిలో రికార్డులతో పాటు థింసా నృత్యం కూడా రికార్డు సృష్టించింది. ఒకేసారి 13వేల మంది గిరిజన మహిళల నృత్యం నిజంగా అద్భుతం. చంద్రబాబు విజన్‌కు హృదయపూర్వక అభినందనలు. భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా పనిచేస్తుంది. ఈ ఎయిర్‌పోర్టు.. ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌లా పనిచేస్తుంది. గతంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒక్క కుటుంబం పేర్లే ఉండేవి. అయోధ్యలో ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు పెట్టాం. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. 2014కు ముందు మన దేశంలో 74 విమానాశ్రయాలే ఉండేవి. మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయి. సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని చేరువ చేశాం. విమానం ఎక్కాలన్న పేద, మధ్యతరగతి కలలు సాకారం చేశాం. తమ ప్రాంతం నుంచే విమానం ఎక్కేలా కొత్త అనుభూతి తీసుకొస్తు?న్నాం. ఉడాన్ ద్వారా దేశ విమానయానరంగంలో పెనుమార్పులు వచ్చాయి.దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. మూలపేట,



రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. పోర్టుల అభివృద్ధితో పాటు హైవే ఎక్స్‌ప్రెస్‌లు సరికొత్త వేగాన్ని అందిస్తున్నాయి. ఏపీలో రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ భవిష్యత్తు వైపు చూస్తారు. సాఫ్ట్‌వేర్, ఐటీ సెక్టార్‌లో తెలుగువాళ్లకు మంచి పేరుంది. దేశ, విదేశాల్లో తెలుగువాళ్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభావం తులైన యువత సామర్థ్యం దేశానికి ఉపయోగపడాలి. చంద్రబాబు సారథ్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీ మారుతోంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఏపీలో గ్రోత్ ఎకో సిస్టం నిర్మిస్తున్నాం. సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి. కేంద్రం.. నక్కపల్లిలో భారీ ఫార్మా కంపెనీ నిర్మిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి' అని మోదీ తెలిపారు. అనంతరం పలు ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. రూ.17,912 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.4,727 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. విశాఖపట్నం తర్లువాడలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్ తొలిదశకు శ్రీకారం చుట్టారు. రూ.468 కోట్ల వ్యయంతో సెమీకండక్టర్ ప్రాజెక్టును ప్రారంభిం చారు. కర్నూలు జిల్లాలో 4 రెన్యువబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.5,550 కోట్ల వ్యయంతో పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ప్రారంభించారు. రూ.3,547 కోట్ల వ్యయంతో కర్నూలు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలులో రూ.823 కోట్ల వ్యయంతో.. చేపట్టిన సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ పథకం ప్రారంభిం చారు. రూ.27 కోట్లతో పెంచల కోన- ఎర్రపాడు హైలె వల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. రూ.763 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-4, రూ.933 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-5 ప్రారంభించారు. రూ.160 కోట్లతో తాడిపత్రి 4 లేన్ బైపాస్ నిర్మాణానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ౧÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## భద్రాచలం వల్ల నిలకడగా గోదావరి

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. శనివారం ఉదయం 11 గంటల నుంచి 56 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. నీటిమట్టం స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాల్లోని రహదారుల పైకి వరద నీరు చేరాయి. దీంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం, వి.ఆర్ పురం, వేలేరుపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో భద్రాద్రి కొత్తగూడెం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి నీటిమట్టం 55.90 అడుగులకు చేరింది. దాదాపు 15,84,657 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం గోదావరి వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మరోవైపు భద్రాచలం గోదావరి వరదలపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలంలోకి వరద నీరు రాకుండా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి వరదలపై ఉన్నతాధికారుల తో ఎప్పటికప్పుడు పరిస్థితిని మంత్రి సమీక్షించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇకపోతే భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి, రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 50 అడుగులు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి 53 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం శనివారం ఉదయానికి 55.1 అడుగులకు పెరిగింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. భద్రాచలం-వెంకటాపురం మార్గంలో రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో భద్రాద్రి ఏజెన్సీలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

## ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

(మొదటి పేజీ తరువాయి)

మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆ÷-లనైన్ ఎ÷-లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు. రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా అహర్నిశలు కృషి

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ సరికొత్త విజయాలను సాధిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పని తీరును ప్రదర్శిస్తోందని ట్వీట్ ద్వారా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో తలసరి ఆదాయం రూ. 4,18,931గా నమోదయ్యిందనీ, ఇది గతేడాది రూ. 3,80,031గా ఉందని గుర్తు చేశారు. ఒకే సంవత్సరంలో తాము 10.23 శాతం వృద్ధిని సాధించామనీ, ఇది రూ. 38,900 పెరుగుదల అని తెలిపారు. కఠోర శ్రమ, ఆర్థిక వృద్ధిపై దృష్టి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, అన్ని రంగాలలో సమతుల్య అభివృద్ధి, తాత్కాలిక విధానాల నుంచి విధాన ఆధారిత పాలనకు మారడం, శ్రద్ధతో కూడిన పని, నిరంతర సమీక్షలు, వివరాలపై శ్రద్ధ, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం... గత దశాబ్దకాలపు వైఫల్య పాలనను, నిరాశావాద వాతావరణాన్ని తిప్పికొట్టి, ప్రతి పౌరునిలో ఆశావాదాన్ని, నమ్మకాన్ని నింపిందని వివరించారు. తమ విజయానికి మహిళలు, రైతులు, యువత అతిపెద్ద లబ్దిదారులని తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత గొప్ప విజయాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

**హైదరాబాద్,ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

(మొదటి పేజీ తరువాయి)

చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అన్నారు.తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

## ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# 17 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్లేట్లు పంపిణీ

**స్ఫూర్తి ఫౌండేషన్ నుంచి 750 మధ్యాహ్న భోజన ప్లేట్లు**

**రూ.90 వేల విలువైన భోజన ప్లేట్ల పంపిణీ..**

**ప్రభుత్వ పాఠశాలలకు అండగా స్ఫూర్తి ఫౌండేషన్**

**కల్లూరు మున్సిపాలిటీలో 100 శాతం మధ్యాహ్న భోజన ప్లేట్ల లక్ష్యం పూర్తి**

**దాతల సహకారంతో ప్రభుత్వ బడులకు చేయూత**

**స్ఫూర్తి ఫౌండేషన్ సేవలకు ప్రశంసలు**

**కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్లేట్ల కొరతకు ముగింపు**






**కల్లూరు, ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో కల్లూరు స్ఫూర్తి ఫౌండేషన్ మరో సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. స్థానిక కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 15 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు, అలాగే పెనుబల్లి మండలంలోని 2 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు కలిపి మొత్తం 17 పాఠశాలలకు రూ. 90 వేల విలువైన 750 మధ్యాహ్న భోజన ప్లేట్లను దాతల సహకారంతో అందజేసింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు భోజన ప్లేట్లను స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ పంపిణీతో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్లేట్ల అవసరాన్ని శాతం 100 మేర తీర్చినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో స్ఫూర్తి ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు ప్రశంసించారు. సమాజంలో సేవాభావంతో ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలుస్తున్న దాతలు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు స్ఫూర్తి ఫౌండేషన్ దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

# అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో మూడు రోజుల ప్రత్యేక ఉచిత యూరాలజీ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి

**• ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ • అత్యాధునిక పరీక్షలు, నిపుణుల వైద్య సేవలు**





**వరంగల్, ఆగస్టు 1:( పిసిడబ్ల్యూ న్యూస్):** మూత్రం సమయంలో మంట, తరచుగా మూత్రం రావటం, మూత్రంలో రక్తం కనిపించడం, కిడ్నీ/ వెన్ను నొప్పి, కిడ్నీలో రాళ్లు, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, ప్రోస్టేట్ గ్రంధి పెరుగుదల సమస్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట, వరంగల్ ఆధ్వర్యంలో ఈ నెల 03, 04, 05 తేదీల్లో ప్రత్యేక యూరాలజీ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ క్యాంప్‌లో ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి, వ్యాధి తీవ్రతను అంచనా వేసి అవసరమైన చికిత్సపై సమగ్ర సలహాలు అందించనున్నారు. క్యాంప్ సందర్భంగా కంప్లీట్ బ్లడ్ కౌంట్, షుగర్ పరీక్ష, కంప్లీట్ మూత్ర పరీక్ష, క్రియాటినిన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ వైద్యుల సలహా మేరకు అందించబడతాయి. అంతేకాకుండా ఇతర ఇన్వెస్టిగేషన్స్ పైన 50 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు కూడా అందుబాటులో ఉంటుందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ క్యాంప్ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుంది. కిడ్నీ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రజలు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకుని ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం తెలియచేయడం జరిగింది స్థలం: అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, అరేపల్లి, వరంగల్ 506006. అపాయింట్‌మెంట్ వివరాలకు: 94598 75555.

# బీజేపీ నేత అవుదుర్తి శ్రీనివాస్ తండ్రి మృతికి కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాళి



**కరీంనగర్, ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** బీజేపీ కరీంనగర్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవుదుర్తి శ్రీనివాస్ తండ్రి ఈరోజు మరణించిన విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం అవుదుర్తి శ్రీనివాస్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**వరంగల్,ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన 19వ ఇన్‌స్టాలేషన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ డా. కె. చంద్రశేఖర్ ఆర్య, విశిష్ట అతిథులుగా లయన్ పొట్లపల్లి శ్రీనివాస్ రావు, లయన్ ముచ్చ రాజిరెడ్డి, లయన్ డా. కె. సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఇన్‌స్టాలేషన్ అధికారులుగా లయన్ రేవూరి రమణ రెడ్డి, లయన్ పబ్బ చంద్రమోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా 202627 సంవత్సరానికిగానూ నూతన అధ్యక్షుడిగా లయన్ సింగారం శ్రీకర్, కార్యదర్శిగా లయన్ కె.సి. రాజు, ఖజానాదారుగా లయన్ ఎం. ఇలేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు మరో ఆరుగురు నూతన సభ్యులు క్లబ్‌లో చేరారు. కార్యక్రమ కమిటీ చైర్మన్ లయన్ అడెపు రవీందర్, కో–చైర్మన్ లయన్ పోరండ్ల రత్నాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో నూతన అధ్యక్షుడు లయన్ సింగారం శ్రీకర్ మాట్లాడుతూ.. రాబోయే ఏడాది కాలంలో పేద ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంబులెన్స్‌లోనే మహిళకు సుఖప్రసవం తల్లి, శిశువు క్షేమం



**పరకాల, ఆగస్టు01 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన పెండెల స్వర్ణలతకు శనివారం ఉదయం ప్రసవ వేదనలు ప్రారంభమవడంతో కుటుంబ సభ్యులు ఆమెను పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని మిషన్ ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె సుఖప్రసవం చేసింది. అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. అనంతరం తల్లి, నవజాత శిశువును చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు 108 అంబులెన్స్ పైలట్ అర్జున్, ఈఎంటీ (టెక్నీషియన్) భాస్కర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు మరోసారి ప్రాణరక్షకంగా నిలిచాయని స్థానికులు అభినందించారు.

# బావుసాయిపేట కాపు సంఘం నుంచి వృద్ధాశ్రమానికి 2,000 విరాళం..



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామ కాపు సంఘం సభ్యులు వేములవాడ పట్టణంలో యువచైతన్య దీపం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి ప్రేమపూర్వకంగా ₹2,000 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతికు అందజేశారు. ఈ సందర్భంగా బావుసాయిపేట గ్రామ కాపు సంఘం సభ్యుల సేవాభావాన్ని ఆయన అభినందిస్తూ, వృద్ధాశ్రమ నిర్వహణకు అందించిన సహకారానికి సంఘం సోదరులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడంలో ముఖ్యపాత్ర పోషించిన యువచైతన్య దీపం ఫౌండేషన్ కొనరావుపేట మండల అధ్యక్షులు షేక్ నజీర్కు శేఖర్ సేనాపతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా జిల్లెల రవీందర్ నియామకం



**ఉప్పల్ ఆగస్టు 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్ సీనియర్ నాయకులు జిల్లెల రవీందర్ రెడ్డి ని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గా నియామకం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బాధ్యతలను నా పై నమ్మకం ఉంచి అప్పగించిన పూర్వ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ ఇచ్చిన ఏ కార్యక్రమమైన విజయవంతంగా కృషి చేస్తానని, అంకితభావంతో పనిచేస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు.

# చింతకుంటలో వనమహోత్సవంలో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి బండి సంజయ్, మేయర్ కొలగాని శ్రీనివాస్







**చింతకుంట ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని చింతకుంట బుల్స్ మెన్ సెంట్రల్ వద్ద నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ తో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ కుమార్, మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. 'క్లీన్ సిటీ గ్రీన్ సిటీ' లక్ష్యంతో నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని కరీంనగర్‌ను అందించేందుకు ప్రజలందరూ వనమహోత్సవ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (ఖు) పి హరి ప్రసాద్ గారు , డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ వా సత్యనారాయణ గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారు, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, కార్పొరేటర్లు,ఆర్పీలు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా..

**మరిన్ని నిధులు తీసుకొస్తా...**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి**

**మేయర్, డిప్యూటీ మేయర్ లతో కలిసి కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**48వ డివిజన్ లో రూ.కోటి, 19వ డివిజన్ లో రూ.97 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి**

**మొగ్దుంపూర్ లో మహిళా శక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని, సీసీరోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించిన బండి సంజయ్**

**శంకుస్థాపనలు...ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బండి సంజయ్ బిజీ బిజీ...**











**కరీంనగర్ ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ.20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి. అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీ నరసింహ కాలనీలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు. అట్లాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు. అంతకుముందు చింతకుంట వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన “వన మహోత్సవం-2026”లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ లోని ప్రతి గల్లీగల్లీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా అభివృద్ధికి అంతగా నోచుకోని నగర శివారు గ్రామాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తనకు ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా క్రుషి చేస్తున్నా. అందుకోసం నా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రూ.22 వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టిన. పలు అభివృద్ధి పనులు చేసిన. త్వరలోనే వివిధ కేంద్ర పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని తెలిపారు.

## హౌసింగ్ బోర్డ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మేయర్‌కు బీజేపీ నేత తోట సాగర్ వినతి...



**కరీంనగర్ ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంహౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ 7వ డివిజన్ బీజేపీ నేత తోట సాగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలోని రోడ్ నెంబర్ - 2, శివాలయం ఏరియా రోడ్డు లోతట్టు ప్రాంతాలలో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఏటా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఈ కష్టాలను శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నేత తోట సాగర్ వినతిపై మేయర్ కొలగాని శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆయా ప్రాంతాలలో పర్యటించి, సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డి “ ఇంజనీరింగ్ డిగ్రీలు క్రిమినల్ వేస్ట్“ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేవైఎం

**● తెలంగాణ చౌక్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం....**





**కరీంనగర్ ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల గురించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ లో కరీంనగర్ బీజేవైఎం జిల్లా శాఖ భారీ నిరసన కార్యక్రమం చేపట్టి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసింది. “ఏటా 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటికి వస్తున్నారు. వాళ్లను పిలిచి ఓ పేపర్ ఇచ్చి జాబ్ అప్లికేషన్ నింపమని చెప్పండి.. ఇంజనీరింగ్ డిగ్రీలు క్రిమినల్ వేస్ట్..” అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం పట్ల బీజేవైఎం కరీంనగర్ నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులను, యువతను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు.చదువుకున్న యువత ప్రతిభను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని, వెంటనే సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బీజేవైఎం శ్రేణులు ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమం లో బిజేవైయం జిల్లా నాయకులు నక్క ప్రమోద్,గుర్రం వెంకటేష్ గౌడ్,చిక్కుల కిరణ్,గడ్డం అరుణ్ ,చుక్కల శ్రీకాంత్ యాదవ్,దయ్యాల రాజు,కొత్తకొండ వెంకటసాయి,ఆకుల మనోహర్, దర్శనాల మణిదీప్,బద్దం రాహుల్ రెడ్డి,బామండ్ల రాజు,ఆవుల తిరిపతి,గణేష్,గాజుల రాజ్ కుమార్ పెద్ద ఎత్తున బిజేవైయం కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌ల ఆలస్యంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలి: అసీమ్, అదాలా






**కరీంనగర్, ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంలో జాప్యం చేయడం వల్ల రాష్ట్రంలోని అనేక కళాశాలలు విద్యార్థుల ఒరిజినల్ విద్యా ధ్రువపత్రాలను నిలిపివేస్తున్నాయని అసీమ్, అదాలా (యాక్సెస్ టు జస్టిస్ నెట్‌వర్క్) ఆందోళన వ్యక్తం చేశాయి.ఇటీవల కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు తమ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, డిగ్రీ సర్టిఫికెట్, ప్రొవిజనల్ సర్టిఫికెట్, కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో తదితర అసలు విద్యా ధ్రువపత్రాలను కళాశాలలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం విడుదల చేయాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అసీమ్, అదాలాకు ఫిర్యాదులు అందాయి.దీంతో అసీమ్‌అదాలా ప్రతినిధి బృందం వాగేశ్వరి డిగ్రీ & పీజీ కళాశాల యాజమాన్యాన్ని కలిసి వినతిపత్రం సమర్పించింది. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం చట్టవిరుద్ధమని, ఇది వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించింది.ఈ అంశంపై స్పందించిన కళాశాల యాజమాన్యం, వచ్చే సోమవారం నుంచి సంబంధిత విద్యార్థులకు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేస్తామని హామీ ఇచ్చింది. యాజమాన్యం సానుకూలంగా స్పందించడాన్ని అసీమ్, అదాలా ప్రతినిధులు స్వాగతించారు.ఈ సందర్భంగా అసీమ్, అదాలా ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో జాప్యం చేసినందుకు విద్యార్థులను శిక్షించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు వంటి అవకాశాలను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.ప్రభుత్వ బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయకుండా మానవతా దృక్పథంతో కళాశాలలు వ్యవహరించాలని కోరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి కూడా ఇదే అంశంపై విద్యాసంస్థలకు ఇప్పటికే సూచనలు జారీ చేసిందని, ఫీజుల వసూలు కోసం అసలు విద్యా ధ్రువపత్రాలను బందీగా ఉంచడం చట్టవిరుద్ధమని తెలంగాణ హైకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసిందని గుర్తుచేశారు.ప్రభుత్వ స్కాలర్‌షిప్‌ల విడుదలలో జాప్యం, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల నిర్బంధానికి సంబంధించిన అంశం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో PIL No.70 శీట 2025లో విచారణలో ఉందని తెలిపారు.స్కాలర్‌షిప్‌లు అందకపోవడం లేదా కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు అసీమ్ స్కాలర్షిప్ హెల్ప్ లైన్: 93471 37002ను లేదా అదాలా (యాక్సెస్ టు జస్టిస్ నెట్వర్క్), కరీంనగర్ ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన న్యాయ సహాయం కూడా అందిస్తామని తెలిపారు. అదాలా వ్యవస్థాపకులు ఎం.ఏ. ముజీబ్ అయ్యూబ్, అమర్ లతీఫ్, వసీమ్ అక్బర్, సయ్యద్ తౌసీఫ్, జీషాన్ మీర్జా, మొహమ్మద్ నేహాల్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాపోరాట యోధుడికి కళాలోకం ఆత్మీయ అభినందనం

**- సి.వై. పుల్లయ్య దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించిన కవులు, కళాకారులు**

**- ప్రజా ఉద్యమాలకు చేసిన సేవలను కొనియాడిన సాహితీ, సాంస్కృతిక ప్రముఖులు**







**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజ మార్పుకోసం నిరంతరం ప్రజల మధ్య నిలిచి పోరాడే నాయకులను గౌరవించడం సమాజ సంస్కృతికి ప్రతీక. అలాంటి ఆత్మీయ దృశ్యానికి ఖమ్మం నగరం వేదికైంది. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రజా నాయకుడు సి.వై. పుల్లయ్యకు కవులు, కళాకారులు, ప్రజా సాంస్కృతిక రంగ ప్రముఖులు హృదయపూర్వక సత్కారం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సి.వై. పుల్లయ్య, ఝాన్సీ దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు పంచుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థి ఉద్యమం నుంచి ప్రజా ఉద్యమాల వరకు ఆయన సాగించిన పోరాట ప్రస్థానం అనేక మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన నిబద్ధత, నిరంతర ఉద్యమ స్ఫూర్తి సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ప్రజల కోసం నిస్వార్థంగా కృషిచేసే నాయకులను గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు. అలాంటి వ్యక్తులను కళాకారులు, కవులు సత్కరించడం ద్వారా ప్రజా ఉద్యమాలకు మరింత ప్రేరణ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఉద్యమ స్ఫూర్తిని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సాహితీ, సాంస్కృతిక రంగం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ప్రముఖ కవి ఐనాల సైదులు, ప్రకృతి వైద్యులు పి.సి.వి. స్వామి, జానపద యుద్ధనౌక పమ్మి రవి, ప్రజాగాయకుడు పాగి వెంకన్న, సినీ గాయకుడు అలవాల నందు, తెలంగాణ ధూంధాం గాయకులు గోవింద గురువయ్య, సినీ నటుడు మిమిక్రీ భద్ర, కోలాటం మాస్టర్ శ్రీకాంత్ కన్నా, పెద్దపాక విజయ్, వంగపండు పుల్లారావు, రాందాస్, రంజిత్, అరుణోదయ శ్రీను తదితరులు పాల్గొని పుల్లయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# 'నీట్' రాష్ట్రస్థాయి ఓపెన్ క్యాటగిరిలో 'కృష్ణవేణి' హవా



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నీట్ - 2026 రాష్ట్రస్థాయి ఓపెన్ క్యాటగిరి ర్యాంకులలో 'కృష్ణవేణి విద్యాసంస్థల' విద్యార్థులు తమ హవా కొనసాగించారని ఖమ్మం నగరంలోని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరావు, యార్లగడ్డ వెంకటేశ్వరావులు అన్నారు. శనివారం ప్రకటించిన నీట్ - 2026 రాష్ట్రస్థాయి ఓపెన్ క్యాటగిరి ర్యాంకులలో కృష్ణవేణి విద్యార్థి ఎస్. గిరీశ్వరరెడ్డి -100 ర్యాంకు సాధించారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరావు, యార్లగడ్డ వెంకటేశ్వరావు లు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ విద్యార్థులు ఓపెన్ క్యాటగిరిలో జేఎల్ఎస్ మైత్రేయి-683, మహమ్మద్ సామియా సమర్-3661, జె. వినీత-5187, ఎస్. కరుణ శ్రీ-5366, జి.ప్రహర్ష-5459, బి.జ్యోత్స్న-6359, కె.రేణుక-6684, కె.అఖిల్ సాయి-8065, ఎస్కె.ముబీస్ జాకీ-8268, కె.అక్షర-8486, జి.ప్రవళిక-9634 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థుల అంకితభావం, అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం ఈ విజయానికి బాటలు వేసాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి వైద్య విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి ఉధృతి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**• ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి**

**• 56.10 అడుగులకు నీటిమట్టం చేరి..మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో.. ఉన్నతాధికారులకు పలు సూచనలు**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నది మరింత ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట సమయం దాకా గోదావరి వరద ఉధృతి 56.10 అడుగులుగా, 15,96,899 క్యూసెక్కులుగా, మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న విషయం తెలుసుకుని.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. **జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా అత్యవసర సమీక్ష** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ లతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి తాజా పరిస్థితులపై ఎంపీ రఘురాం రెడ్డి ఆరా తీశారు. గోదావరి వరద ఉధృతి, సహాయక చర్యల తీరుపై చర్చించి సూచనలు చేశారు. నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున కరకట్టల వెంబడి, లీకేజీలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో సంబంధిత సిబ్బంది ద్వారా నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. **ఏజెన్సీలో రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో..** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రవాణా మరియు అత్యవసర సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. నిర్వాసితులకు తాగునీరు, వైద్యం, భోజన వసతి సక్రమంగా అందేలా చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

# వెలుగుమట్ల ఇల్లు కూల్చివేత రాజ్యాంగ విరుద్ధం

**- సంపూర్ణ న్యాయం చేయకపోతే రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తాం**

**- డాక్టర్ భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్**









**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కూల్చివేసినది కేవలం ఇటుకలు, సిమెంటుతో కట్టిన గోడలను మాత్రమే కాదు... దశాబ్దాల తరబడి నిరుపేదలు పోగేసుకున్న భవిష్యత్తు ఆశలను, ఆత్మగౌరవాన్ని! పదిహేనేళ్లుగా భూదాన్ భూముల్లో ఆశ్రయం పొందుతున్న నిరుపేదల ఇళ్లను ఏకపక్షంగా కూల్చివేయడం అత్యంత అమానుషం, రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని డాక్టర్ భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన వెలుగుమట్ల మిగిలిన భూదాన బాధితులందరికీ వెలుగుమట్లలోనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని వేలాది మందితో జేఏసీ జండాలతో శనివారం ఖమ్మం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీ సెంటర్లోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన అంబేద్కర్ మనవడు డాక్టర్ భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ... 15 సంవత్సరాలుగా బుధాన్ భూమిలో నివాసముంటున్న పేద ప్రజల ఇల్లు కూల్చడం అత్యంత అమానుషం, ఇది రాజ్యాంగ విరుద్ధం అన్నారు. కూల్చినవాడి కులం కూల్చి వేయబడ్డవాడి కులం వేరు కనుకనే ఈ దుర్మార్గం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దీనికి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని మిగతా బాధితులందరికీ కూడా వెలుగుమట్లలోనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేనియెడల రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తామని.. మా ఎంపీలతో పార్లమెంట్లో వెలుగుమట్ల అంశాన్ని లేవనెత్తి ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిని నిలదీస్తామన్నారు.. రాష్ట్రపతిని స్వయంగా కలిసి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇల్లు కూల్చిన అధికారులను, ప్రజా ప్రతినిధులను తక్షణమే సస్పెండ్ చేసి కూల్చిన వారి ఇల్లు ఖరీదులను వీరి వద్దనే రికవరీ చేసేదాకా వెలుగుమట్ల బాధితులకు అండగా ఉంటానని అన్నారు.. మరో గౌరవ అతిథి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ... వెలుగుమట్ల భూదాన్ విషయంలో నిజనిర్ధారణ కమిటీ వేసి మేము పరిశీలించగా ఇది కొందరు భూ బకాసురులు స్వాధీనం చేసుకునేందుకే అధికారులను బ్లాక్ మెయిల్ చేసి ఈ కుట్రకు పూనుకున్నారన్నారు.. ఇప్పటికే బాధితులకు మద్దతుగా లీగల్ గా నేను మద్దతు ఇస్తూ వస్తున్నాను కానీ మిగతా బాధితులకు ఆ వెలుగుమట్లలోనే ఇల్లు నుంచి ఇవ్వకపోతే అందరిపై హైకోర్టులో కేసులు వేస్తాము. సుప్రీంకోర్టు దాకా ఈ విషయాన్ని తీసుకువెళతామన్నారు. ప్రత్యక్షంగా నేనే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానన్నారు. మరో అతిథి పేద ప్రజల ఇల్లు కూల్చివేతకు ఆవేదన చెంది భారీ మహాధర్నాను కొనసాగించి వెలుగుమట్లలోనే వారికి ఇల్లు వచ్చేదాకా ఆమరణ నిరాహార దీక్ష చేసిన డాక్టర్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ... బాధితులు జేఏసీ ఆధ్వర్యంలో చేసిన మహాధర్నా ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి 311 ఇల్లు ఇచ్చిందని, మిగిలిన వారికి తక్షణమే అదే వెలుగుమట్లలో నిర్మించి ఇవ్వాలని, లేనియెడల బాధితులతో రేవంత్ రెడ్డి ఇంటిదాకా పాదయాత్ర కొనసాగిస్తామని అన్నారు. ఖమ్మంలో కొనసాగుతుంది కమ్మ కుల రాజకీయ ఆధిపత్యం అని దానికి ఆజ్యం పోస్తుంది తుమ్మల నాగేశ్వరావని, తన కులాన్ని ప్రేమగా చూడటం వారికి సౌకర్యాలు కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ వెలుగుమట్ల ఘటన వారి క్రూరత్వానికి వెలుగు చాటిందన్నారు. ఇక వారి రాజకీయ సమాధికి పునాదులు పడ్డాయని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలో నాయకత్వం వహిస్తున్న వారి సామాజిక వర్గాన్ని కలుపుకొని తుమ్మల నాగేశ్వరరావు ఈ పేద ప్రజల ఇల్లు కూల్చివేతకు సిద్ధపడ్డాడని విమర్శించారు.. ఇది ఖమ్మం జిల్లా కాదు అని ఇది ఒక కమ్మ దేశమని... ఇక్కడ 90% గా ఉన్న దళిత బహుజనులు ఆత్మగౌరవం లేకుండా బ్రతుకుతున్నారని వెలుగుమట్ల ఘటన చెప్పకనే చెబుతుందన్నారు. 729 ఇల్లు కూల్చమని ప్రభుత్వమే స్వయంగా ఒప్పుకొని 311మందికి వెలుగుమట్లలో మిగతా వారిని పక్కకు పెట్టగా ఆరు నెలల సుదీర్ఘ మా జేఏసి పోరాటం ద్వారా మిగతా వారికి కూడ ఇల్లు ఇస్తామని కానీ వేరే ప్రాంతంలో ఇస్తామని చెప్పటం మరో కుట్రకు పూనుకున్నారని అర్థమవుతుందని, తక్షణమే వెలుగుమట్లలోనే మిగతా వారికి ఇల్లు ఇవ్వని ఎడల ఖమ్మంలో మరో భూకంపాన్ని చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఐ పార్టీ తెలంగాణ ఇన్చార్జ్ మేజర్ చంద్రకాంత్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల ముదిరాజ్ రాఘవేంద్ర, తెలంగాణ విఠల్, ప్రముఖ న్యాయవాది పంజాకుల లక్ష్మీనారాయణ, జేఏసీ ఖమ్మం జిల్లా నాయకత్వం, భూదాన్ బాధితులు, ఆయా ప్రజా సంఘాల నాయకులు, తదితరులు హాజరయ్యారు.

# వరద కాలువకు నీరు విడుదల చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**- స్వయంగా కలిసి ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**వేములవాడ ఆగస్టు 1(పిసిడబ్ల్యూ న్యూస్):**
వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాతో పాటు బాల్కొండ నియోజకవర్గనికి, చుట్టు పక్కల ప్రాంతాలకు ఉపయోగ పడే వరద కాల్వకు 1 టిఎంసి నీరు విడుదల చేయాలని నిన్న రాత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డినీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరడం జరిగింది.వెంటనే స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వరద కాల్వకు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.అధికారులు నిన్న రాత్రి విద్యుత్ అధికారుల సమన్వయంతో శనివారం ఉదయం ఎల్లంపల్లి నీటిని రాంపూర్ పంపు హౌస్ ద్వారా విడుదల చేయడం జరిగింది.వరద కాల్వకు నీరు విడుదల చేయడం ద్వారా కాల్వలో నీరు ఉండి భూగర్భ జలాలు పెరగడానికి ఆస్కారం ఉంది.కాగా నీరు విడుదల చేయడం పట్ల మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డినీ కలసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు..



# సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ బారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా..

**కరీంనగర్ ఆగస్టు 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా 53వ డివిజన్ సహేత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన మెహరాజ్ ఆధ్వర్యంలో, సిటీ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ బారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అబ్దుల్ బారిని శాలువాతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొని మహమ్మద్ అబ్దుల్ బారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# సంపాదకీయం




## ఉత్తరాంధ్రకు మణిహారం

# భోగాపురం !

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్దిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్శాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే!మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# ఈ యేడు తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు

**•సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో**

## వరుసగా నిర్వహణ



**తిరుమల,ఆగస్ట్1:** తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. ఈ మేరకు టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం ఉంటుంది. 16న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం ఉంటుంది. 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనం నిర్వహిస్తారు. 18న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనం, 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనం నిర్వహిస్తారు. 21న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం, 22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, 23న ఉదయం 6 నుంచి 9 వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో సిఫారసు లేఖలను అనుమతించరు.

# ఎర్రబస్సు కాదు..
# ఎయిర్ బస్సులు వాలుతాయ్

**కళ్లు తెరచి చూస్తే అభివృద్ది కనిపిస్తుంది**

**భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంలో రామ్మోహన్**

**ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చారన్న లోకేశ్**



**విజయనగరం,ఆగస్ట్1:** ప్రపంచం మొత్తం ఇప్పుడు ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ మాట్లాడుతూ... యువతకు ఉద్యోగావకాశాలు పెరగబోతున్నాయన్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ సింహద్వారమని చెప్పుకొచ్చారు. ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం మారనుందని తెలిపారు. ఎర్రబస్సు కూడా తిరగని ప్రాంతమని కొందరు హేళన చేశారని కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కళ్లు తెరిచి చూడండి.. ఎయిర్‌బస్సు తిరిగే ప్రాంతమైంది' అని తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రతి ఇంటి పండుగ ఇది అని అన్నారు. మన్యం వీరుడు అల్లూరి పేరు ప్రపంచం మొత్తం మార్మోగుతోందని తెలిపారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా ప్రధాని మోదీది అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు మోదీ. సీఎం చంద్రబాబు నాయకత్వంలో విజన్ 2047, ప్రధాని మోదీ సారథ్యంలో వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం అని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఉత్తరాంధ్ర కలలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెక్కలిచ్చారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి నడిచిన ప్రాంతం.. ఉత్తరాంధ్ర. ఈ విమానాశ్రయం ఏపీకి పవర్ ఇంజిన్‌గా మారుతుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకం కాబోతోంది. ఏపీ అభివృద్ధికి మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారు. నమో సహకారంతోనే రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతం ఉత్తరాంధ్ర. ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గుతాయి. ఎర్రబస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది.. మన ప్రధాని మోదీ వచ్చారు. శరవేగంగా విమానాశ్రయం నిర్మించిన జీఎంఆర్‌కు అభినందనలు' అని లోకేశ్ తెలిపారు.

# క్షమాపణలు కాదు...
# కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

**- ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు**



**న్యూఢిల్లీ,ఆగస్ట్1:** విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?' అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబిుబబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## పూర్తిస్థాయి నీటి మట్టానికి
# చేరువలో ఎల్లంపల్లి

**- సందర్శకులను అనుమతించని అధికారులు**

**కరీంనగర్,ఆగస్ట్1:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హాజీపూర్ మండలంలోని గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు అందాలను వీక్షించి ఆనందించాలనుకునే సందర్శకులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది.

గేట్ల ఎత్తివేత నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో గుడిపేట చేపల మార్కెట్ వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవరినీ అనుమతించడంలేదు. దీంతో ప్రాజెక్టు చూసేందుకు వచ్చిన సందర్శకులు అసహనంతో వెనుదిరిగిపోతున్నారు. దీంతో స్థానికులు పర్యాటకులు పోలీసులు, నీటిపారుదల శాఖల తీరుపై మండిపడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం అనంతరం అవతలి వైపున ఉన్న పెద్దపల్లి జిల్లాకు చిన్న వాహనాల రాకపోకలకు అనుమతులు ఇవ్వడంతో ఈ మార్గం ద్వారా ప్రతి రోజు వందలాది మంది ప్రయాణిస్తున్నారు.

రామగుండంలోని ఎన్టీపీసీకి విధులకు హాజరయ్యే ఉద్యోగులు కూడా ఈ మార్గాన్నే ఎక్కువగా వినిగియోస్తుంటారు. పెద్దపల్లి జిల్లాలో పనిచేసే కూలీలు, ఇతర కార్మికులు సైతం నిత్యం ఈ ప్రాజెక్టు మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు.

పాలవ్యాపారులు కూడా ప్రతిరోజు పదుల సంఖ్యలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి ఈమార్గం ద్వారానే వెళ్తుంటారు. ప్రస్తుతం ప్రాజెక్టు పైకి వెళ్లేందుకు ఆంక్షలు విధించడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నా అటిట్యూడ్ వల్లే జట్టులో చోటు కోల్పోయా....

### ఎప్పుడూ కెప్టెన్సీ కోసం ఆడలేదు..

### ఓ ఇంటర్వ్యూలో హార్దిక్ పాండ్యా ఆసక్తికర వ్యాఖ్యలు



కెరీర్ ప్రారంభంలో తన ఆట కంటే అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారని హార్దిక్ పాండ్యా తెలిపాడు. అప్పుడు తనకు ఈ విషయం తెలిసేది కాదని చెప్పుకొచ్చాడు. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. టీమిండియా తదుపరి వైట్ బాల్ సిరీస్‌లు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హార్దిక్ పాండ్యా తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను ఎప్పుడూ కెప్టెన్సీ కోసం ఆడలేదని, జట్టు కోసమే ఆడానని తెలిపాడు. 'సారథ్యం విషయానికి వస్తే.. నాకు నేను ఎప్పుడూ సందేహించలేదు. ఎందుకంటే నేను ఎప్పుడు పదవులు కోసమో లేక నా మాట నెగ్గించుకోవడానికో ఆడను. నేను కెప్టెన్ కాకపోయినా జట్టులో నాయకుడిలాంటి వాడినని భావిస్తాను. జట్టులో నాది ఒక ప్రత్యేకమైన, ప్రభావవంతమైన పాత్ర అని నాకు తెలుసు. నేను చెప్పే మాటలను జట్టులో 11 మంది ఆటగాళ్లు వింటారు.నాయకుడిగా ఉండటానికి కెప్టెనే కానవసరం లేదనేది నా నమ్మకం. ఒక ఆటగాడిగా కూడా నాయకుడిగా ఉండవచ్చు. నేను చాలా అదృష్టవంతుడిని, కృతజ్ఞుడిని అని భావిస్తున్నా. నేను కెప్టెన్సీ కోసం ఎప్పుడూ ఆడలేదు. ప్రతి క్రికెటర్ కల దేశానికి ప్రాతినిథ్యం వహించడమే. కానీ కెప్టెన్సీ అనేది ఒక అదనపు గౌరవం. అయితే ఆ సంతోషం నాకు కొద్ది నిమిషాలు మాత్రమే నిలిచింది. ఆ తర్వాత జట్టును ఎలా మెరుగుపర్చగలననే ఆలోచించాను. ఆ సమయాన్ని నేను ఆస్వాదించాను. అయితే వాటిని నేను మనసుకు తీసుకోను. ఎందుకంటే అవి ఏ క్షణంలోనైనా మనల్ని విడిచివెళ్లిపోవచ్చు. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం నాకు ముఖ్యం కాదు. ఎందుకంటే అది నాకు అనవసరం. నా పనితో నేను సంతోషంగా ఉన్నానా లేదా? అన్నదే నాకు ముఖ్యం. నేను క్రికెట్ నుంచి బ్రేక్ తీసుకోవడానికి ప్రధాన కారణం నా మనసును ఉత్తేజపరుచుకొని, ఆ పాత ఉత్సాహాన్ని తిరిగి పొందడమే. కేవలం ఆటను ఆస్వాదించడానికే ప్రయత్నిస్తాను.నేను కష్టపడేది కేవలం నా కోసమే. నా సంతోషం, మనశ్శాంతి కోసమే, ఇతరుల కోసం కాదు. అంతా సవ్యంగా సాగినప్పుడు నేను విమర్శకులపై ప్రతీకారం తీర్చుకున్నానని అందరూ అనవచ్చు. కానీ అది నా ఉద్దేశం ఏ మాత్రం కాదు. నాకు నేను సంతృప్తి చెందడమే నా ఏకైక లక్ష్యం. నేను వచ్చిన నేపథ్యం. నా ప్రయాణం ఆధారంగా నేను ప్రత్యేకంగా నిలబడాల్సి వచ్చింది. నా వ్యక్తిత్వం మొదటి నుంచి పూర్తిగా భిన్నంగా ఉండేది. అందుకే నేను ఎదిగే క్రమంలో చాలా సమస్యలను ఎదుర్కొన్నాను.నాకు రంగురంగుల వస్తువులు అంటే ఇష్టం.నేను ఎప్పుడూ చురుకుగా.. హాస్య భరితంగా ఉండేవాడిని. నేను సాధారణ సాంప్రదాయ క్రికెటర్లలా కాకుండా.. కాస్త భిన్నమైన వ్యక్తిని. ఇప్పుడు అది నాకు అనుకూలంగా ఉండొచ్చు. కానీ తొలినాళ్లలో నన్ను చాలా జట్టు నుంచి తొలగించారు. పరుగులు చేయనందవల్ల కాదు.. నా అటిట్యూడ్ నచ్చకనే జట్టు నుంచి తప్పించేవారు. అప్పుడు అటిట్యూడ్ అంటే ఏంటో కూడా నాకు తెలియదు. దాని గురించి నాకేమీ అవగాహన కూడా లేదు.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.

# కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్ల విశ్వరూపం



### • ఏడుకు పెరిగిన భారత్ స్వర్ణ పతకాల సంఖ్య

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్ల విజయ పరంపర కొనసాగుతోంది. శనివారం జరిగిన బాక్సింగ్ ఈవెంట్లలో ఇద్దరు బాక్సర్లు.. నిమిషాల వ్యవధిలో రెండు స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. మొత్తంగా సుమారు గంట వ్యవధిలో భారత బాక్సర్లు మూడు పతకాలు సాధించి క్రీడాభిమానులను మురిపించారు. మహిళల విభాగంలో ప్రీతి పవార్ , జైస్మిన్‌లు పసిడి పతకాలతో మెరవగా, పురుషుల విభాగంలో జాదుమణి సింగ్ రజత పతకాన్ని ముద్దాడి భారత్ పతకాల పట్టికను మరింత ముందుకు తీసుకెళ్లారు. మహిళల విభాగంలో 22 ఏళ్ల యువ బాక్సర్ ప్రీతి పవార్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఫైనల్ పోరులో చురుకైన కదలికలు, శక్తివంతమైన పంచ్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడి విజయాన్ని అందుకుంది. ఈ కామన్వెల్త్ గేమ్స్ 2026 బాక్సింగ్ విభాగంలో భారత్‌కు మొట్టమొదటి స్వర్ణ పతకాన్ని అందించిన బాక్సర్‌గా ప్రీతి పవార్ నిలిచింది. ఫైనల్‌లో కెనడాకు చెందిన స్కార్లెట్ సవన్నా డెల్గాడోను ప్రీతి 5–0 తేడాతో మట్టికరిపించింది. దీంతో ప్రీతి పవార్ ఫైనల్ మ్యాచ్‌ను వన్ సైడ్ చేసేసింది.ప్రీతి ఇచ్చిన జోష్‌తో బరిలోకి దిగిన ప్రపంచ ఛాంపియన్, ఆర్మీ బాక్సర్ జైస్మిన్ లంబోరియా తన అనుభవాన్నంతా ఉపయోగించి రింగ్‌లో ప్రత్యర్థికి చుక్కలు చూపించింది. పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఏకపక్షంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన మైఖేలా వాల్ష్‌పై జైస్మిన్ ఏకంగా 5–0 తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో నిమిషాల వ్యవధిలోనే భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు చేరాయి. జైస్మిన్ సాధించిన ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారతదేశం సాధించిన మొత్తం స్వర్ణ పతకాల సంఖ్య 7కు చేరుకుంది. మరోవైపు పురుషుల ఫైనల్లో పోరాడిన భారత బాక్సర్ జాదుమణి సింగ్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో చివరి వరకు పోరాడినప్పటికీ, స్వల్ప తేడాతో విజయాన్ని చేజార్చుకొని రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. మొత్తంగా గంట వ్యవధిలోనే భారత్ రెండు స్వర్ణాలు, ఒక రజతం సాధించింది.

# విండీస్ టీమ్‌లో భగ్గుమన్న విభేదాలు!

వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీపై ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ అల్జారీ జోసెఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తానేం డారెన్ సామీ తొత్తును కాదని, వెస్టిండీస్ ఆటగాడినని స్పష్టం చేశాడు. వ్యక్తిగత కక్షతో తన గురించి అవాస్తవాలు మాట్లాడటం డారెన్ సామీకి తగదని హితవు పలికాడు. తన గురించి అన్నీ తెలిసి కూడా ఎందుకు అసత్యాలు మాట్లాడాడో అర్థం కావడం లేదన్నాడు.డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో భాగంగా సొంతగడ్డపై పాకిస్థాన్‌తో వెస్టిండీస్ రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడుతోంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వెస్టిండీస్ గెలిచి 1–0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఈ సిరీస్‌కు అల్జారీ జోసెఫ్ దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాలతోనే అల్జారీ జోసెఫ్ ఈ సిరీస్ ఆడటం లేదని వెస్టిండీ క్రికెట్ బోర్డు ప్రకటించింది. కానీహెడ్ కోచ్ డారెన్ సామీ మాత్రం భిన్నమైన కారణాన్ని చెప్పాడు. అల్జారీ జోసెఫ్ ఉద్దేశపూర్వ కంగానే జట్టు సెలెక్షన్‌కు దూరంగా ఉన్నాడని, పాకిస్థాన్‌తో ఆడటానికి అతను నిరాకరించాడని తెలిపాడు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పాకిస్థాన్ మీడియాతో పాటు అభిమానులు అల్జారీ జోసెఫ్‌పై విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన అల్జారీ జోసెఫ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్‌కు ముందు నేను



మా హెడ్ కోచ్‌తో మాట్లాడాను. విండీస్ బోర్డుతో కూడా చర్చించాను. ఆ సమయంలోనే బోర్డు నేను వ్యక్తిగత కారణాల వల్ల దూరమయ్యానని ప్రకటించింది. అన్ని విషయాలు తెలిసి కూడా సామీ అలా ఎందుకు చెప్పాడో నాకు అర్థం కావడం లేదు. అతని వ్యాఖ్యలు ఎక్కడికి దారితీస్తాయో నాకు తెలుసు. నా గురించి తెలిసి కూడా ఇలా మాట్లాడటం ఎందుకు? నిజానికి ఈ ఏడాది నేను ఆటకు దూరంగా ఉన్నా. కండరాల నొప్పి కారణంగా నా శరీరం సహకరించడం లేదు. టెస్ట్ ఫార్మాట్ ఆడేందుకు నేను ఏ మాత్రం సిద్దంగా లేను. ఇవన్నీ తెలిసి కూడా సామీ నాకు వ్యతిరేకంగా మాట్లాడాడు. ఇలా సమయం, సందర్భం లేకుండా ఎలా మాట్లాడుతారు? నేను ప్రొఫెషనల్‌క్రికెట్‌ను. నా పనిని నేను చేసుకుంటా. నేను వెస్టిండీస్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నా.నేనేం డారెన్ సామీ తొత్తును కాదు. కాబట్టి ఈ వ్యాఖ్యలతో నాకు ఒరిగేదేం లేదు. అయినా నేనేం జట్టు సభ్యులను స్నేహితులుగా మార్చుకునేందుకు ఆడటం లేదు. వెస్టిండీస్ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. ఎవర్ని పట్టించుకోకుండా నా బాధ్యతనే నేను నిర్వర్తిస్తాను.'అని అల్జారీ జోసెఫ్ పేర్కొన్నాడు. ఈ ఇద్దరి వ్యాఖ్యలు వెస్టిండీస్ క్రికెట్‌లోని విభేదాలను బయటపెట్టాయి. వెస్టిండీస్, పాకిస్థాన్ మధ్య రెండో టెస్ట్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది.

# రుమేష్ తారంగ పతిరగె సంచలనం

### • రికార్డు త్రోతో పసిరి పట్టిన అథ్లెట్ రుమేష్



స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల జావెలెన్ త్రో ఫైనల్లో శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల యంగ్ అథ్లెట్ రుమేష్ తారంగ పతిరగె సంచలనం సృష్టించాడు. ఏకంగా 89.75 మీటర్ల దూరం జావెలిన్ విసిరి, ఒలింపిక్ ఛాంపియన్లు నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్‌లను ఓడించి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. చిన్నతనంలో క్రికెట్ ఫాస్ట్ బౌలర్‌గా రాణించిన రుమేష్, తండ్రి ప్రోత్సాహంతో జావెలెన్ త్రో వైపు మళ్లి ఈ స్థాయికి ఎదిగాడు. జావెలెన్ త్రోలో నీరజ్ చోప్రాకు ప్రధాన పోటీదారుగా మారాడు.కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల జావెలెన్ త్రో అనగానే అందరి దృష్టి ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్‌లు భారత స్టార్ నీరజ్ చోప్రా, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్‌లపైనే ఉంది. అయితే గ్లాస్గో వేదికగా శనివారం తెల్లవారుజామున జరిగిన ఫైనల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ శ్రీలంకకు చెందిన 23 ఏళ్ల రుమేష్ తరంగ పతిరగె సంచలన ప్రదర్శన చేశాడు. ఫైనల్లో ఏకంగా 89.75 మీటర్ల దూరం ఈటెను విసిరి పసిడి పతకాన్ని ముద్దాడాడు. దీని ద్వారా కామన్వెల్త్ గేమ్స్ అథ్లెటిక్స్ విభాగంలో శ్రీలంక తరఫున స్వర్ణ పతకం సాధించిన తొలి అథ్లెట్‌గా రుమేష్ రికార్డు క్రియేట్ చేశాడు. ఈ విభాగంలో నీరజ్ చోప్రా రజతం, భారత్‌కే చెందిన యశ్వీర్ సింగ్ కాంస్యం సాధించారు. దీంతో ఆసియా అథ్లెట్లు పోడియంను క్లీన్ స్వీప్ చేశారు. వాస్తవానికి 2026 సీజన్ ప్రారంభం నుంచే రుమేష్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పర్త్ ట్రాక్ క్లాసిక్ గెలవడంతో పాటు, మార్చిలో 89.37 మీటర్లతో జాతీయ రికార్డు నమోదు చేశాడు. ఆ తర్వాత కెన్యాలోని కిప్ కేనో క్లాసిక్ గెలిచిన అతడు, రోమ్ డైమండ్ లీగ్‌లో ఏకంగా 92.62 మీటర్ల కళ్ళు చెదిరే త్రో విసిరి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. ఈ సీజన్‌లో 90 మీటర్ల మార్కును దాటిన ఏకైక అథ్లెట్‌గా నిలిచాడు. ఆ తర్వాత ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్, దోహా డైమండ్ లీగ్‌లలో కూడా విజయం సాధించి గ్లాస్గోలో అడుగుపెట్టాడు.అయితే కెరీర్ ప్రారంభం నుంచి రుమేష్.. జావెలిన్ త్రోయర్ కాదు. రుమేష్, కాలేజీలో చదువుతున్న రోజుల్లో క్రికెట్‌లో ఫాస్ట్ బౌలర్‌గా మంచి వేగంతో బంతులు విసిరేవాడు. సుమారు 130 కి.మీ వేగంతో బ్యాటర్లకు బంతులు సంధించేవాడు. కానీ స్వతహాగా డిస్కస్ త్రోయర్ అయిన తన తండ్రి ప్రోత్సాహంతో 2017లో జావెలెన్ పట్టాడు. ఆ నిర్ణయం అతడి జీవితాన్ని మార్చివేసింది. 2022 ప్రపంచ అండర్–20 ఛాంపియన్‌షిప్‌లో 7వ స్థానంలో నిలిచిన రుమేష్, ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్‌లో మైక్, కేల్సీ బార్బర్ అనే ప్రముఖ కోచ్‌ల శిక్షణలో తనను తాను మెరుగుపరుచుకున్నాడు. నిలకడగా 88 మీటర్లకు పైగా ఈటెను విసరడాన్ని అలవాటుగా చేసుకున్నాడు. ఇక గత కొన్నేళ్లుగా ఆసియాలో జావెలిన్ త్రోయర్లు అంటే.. నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్‌ల పేరే వినిపించేది. కానీ గ్లాస్గో విజయంతో రుమేష్.. ఆ కాంబినేషన్‌ను త్రిముఖ పోరుగా మార్చేశాడు. ఈ సీజన్ బెస్ట్ త్రో (92.62 మీటర్లు), కామన్వెల్త్ గోల్డ్ మెడల్‌తో ఉన్న రుమేష్, రాబోయే ఆసియా గేమ్స్‌లో నీరజ్ చోప్రాకు అతిపెద్ద సవాల్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకప్పుడు ఫాస్ట్ బౌలర్‌గా ఉన్న కుర్రాడు, ఇప్పుడు ప్రపంచ జావెలెన్ రంగాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు.

# ఫైనల్‌కు తాన్వీ శర్మ

తైపీ: తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సూపర్–300లో భారత మహిళా యువ షట్లర్ తాన్వీ శర్మ సంచలనం నమోదు చేసింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో తనకంటే మెరుగైన ర్యాంక్ క్రీడాకారిణి హు–సన్–హువాంగ్‌ను ఓడించింది. ఏకపక్షంగా సాగిన గేమ్‌లో తాన్వీ 21–17, 21–11తో 5వ ర్యాంక్ క్రీడాకారిణి, తైపీకి చెందిన హువాంగ్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్ కేవలం 33 నిమిషాల్లోనే ముగిసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తాన్వీ శర్మ 34వ ర్యాంక్ క్రీడాకారిణి. ఆదివారం జరిగే ఫైనల్లో నుయెన్(వియత్నాం)తో తలపడనుంది. మరో సెమీస్‌లో నుయేన్ 15–21, 18–21తో 3వ ర్యాంకర్, భారత్‌కు చెందిన ఉన్నతి హుడాను ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి ఓటమిపాలయ్యాడు. శనివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో కిరణ్ జార్జి 12–21, 10–21తో జపాన్‌కు చెందిన 4వ ర్యాంక్ ఆటగాడు వుదాయ్ ఒకిమోటో చేతిలో ఓడాడు.



# కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా




నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి.ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

## జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు.రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

## పెళ్ళి చుట్టూ సాగే కథతో క్రేజీ కళ్యాణం

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, నరేష్ వీకే కీలక పాత్రల్లో నటిస్తున్న ఎంటర్‌టైనర్ 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. సురేశ్ బొబ్బిలి ఈ సినిమాకు సంగీతం అందించారు.




## లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన

ఇప్పుడు ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నానని వెల్లడి

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది.

"గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను" అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది.



## కార్తీ 'సర్దార్ 2' టీజర్.. యాక్షన్ డోస్ నెక్స్ట్ లెవెల్!




కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై-స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు.ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా శ్రీలంక షెడ్యూల్ రద్దు!

యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ - మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రం షూటింగ్ కు బ్రేక్ పడింది. ఇటీవల హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ఎన్టీఆర్ భుజానికి తీవ్ర గాయమవడంతో సినీ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, వైద్యుల సూచన మేరకు తారక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని, కంగారు పడాల్సిన పనిలేదని ఆయన టీమ్ భరోసా ఇచ్చింది.వైద్యులు ఎన్టీఆర్‌ను సుమారు 6 నుంచి 8 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోమని స్పష్టం చేయడంతో, 'డ్రాగన్' చిత్రీకరణను మేకర్స్ తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఈ గాయం కారణంగా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిన భారీ శ్రీలంక షెడ్యూల్‌ను పూర్తిగా రద్దు చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే.. అంటే సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ ప్రారంభంలో ఈ కొత్త షెడ్యూల్‌ను తిరిగి పట్టాలెక్కించే అవకాశాలున్నాయి.ప్లానింగ్ ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్ 11 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాతలు పనిచేస్తున్నారు. షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ పడినా పోస్ట్ ప్రొడక్షన్, డెడ్‌లైన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.

ప్రమాద ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో #GetWellSoonNTR హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తమ అభిమాన నటుడు త్వరగా కోలుకుని, మరింత శక్తివంతంగా కెమెరా ముందుకు రావాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు

